క్లుప్తంగా

మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్



కాలువలో ఆయిల్ బాల్స్ వదులుతున్న డాక్టర్ ఆనందమోహన్, సిబ్బంది

మద్దిపాడు: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద మురుగు కాలువలో పీహెచ్‌సీ డాక్టర్ ఆనందమోహన్ బుధవారం ఆయిల్ బాల్స్ వేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమలు నివారించడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్న నేపథ్యంలో ఆయిల్ బాల్స్‌ను అన్ని గ్రామాల్లోని మురుగు కాలువల్లో వేయాల్సిందిగా ఎంపీడీఓ ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో బుధవారం నుంచి సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరోవైపు వైద్యశాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు, గ్రామ కార్యదర్శులు మూకుమ్మడిగా మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేసి ఎబేట్ చల్లించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రజనీ, హెచ్‌వీ సీతమ్మ, సూపర్‌వైజర్ బాలకోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గార్లపాడులో ఫాగింగ్...

మండలంలోని గార్లపాడు గ్రామంలో సర్పంచ్ గంగిరెడ్డి దోమల నివారణకు సొంత ఖర్చులతో ఫాగింగ్ చేయించారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఫాగింగ్ చేయించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ బాలకోటయ్య వెల్లడించారు.

సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

కందుకూరు: మార్కెట్ యార్డు ఆవరణలోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో స్టాకు రిజిస్టర్లను పరిశీలించి వివరాలడిగి తెలుసుకున్నారు. గోడౌన్ నుంచి ఏ ప్రాంతాలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు సరఫరా చేస్తున్నారు, ఎన్ని టన్నుల బియ్యం సరఫరా అవుతున్నాయనే వివరాలడిగి తెలుసుకున్నారు. రేషన్ షాపులకు సకాలంలో బియ్యాన్ని సరఫరా చేయాలని, స్టాకు వివరాలు కచ్చితంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా అవకతవకలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ

గుడ్లూరు (కందుకూరు రూరల్): మండలంలోని పోట్లూరు పంచాయతీ ఎస్టీకాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ గోవర్ధన్ బుధవారం పరిశీలించారు. వర్క్ పుస్తకాలు పరిశీలించగా 27 మంది విద్యార్థులు ఒక్క బుక్ కూడా సక్రమంగా చేయలేదని గుర్తించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం వంట చేసి పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతిరోజూ విద్యార్థులంతా తప్పనిసరిగా పాఠశాలలోనే భోజనం చేసేలా చూడాలన్నారు. వంట రుచిగా చేస్తే విద్యార్థులంతా తింటారని చెప్పారు. విద్యార్థులు వర్క్ పుస్తకాలు ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు తనిఖీ చేయాలని సూచించారు. అదే విధంగా పోట్లూరు ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. వర్క్ పుస్తకాలు అందరూ సక్రమంగా నిర్వహిస్తున్నట్లు సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కందుకూరు విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు

కందుకూరు రూరల్: ఒంగోలు మినీ స్టేడియంలో ఈ నెల 22వ తేదీ నిర్వహించిన ఎస్‌జీఎఫ్ చెస్ ఎంపిక పోటీల్లో కందుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి తెలిపారు. అండర్-17 విభాగంలో కట్టా కిరణ్, అండర్-14 విభాగంలో నిర్మల్ జస్టిస్ ఎంపికై నట్లు చెప్పారు. కట్టా కిరణ్ బాపట్ల జిల్లా, నిర్మల్ జస్టిస్ సత్యసాయి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అదే విధంగా హిందూపూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు అండర్-14 విభాగంలో ఎస్‌కే సుభాని ఆజాద్, ఆలూరి జాషువ ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే అండర్-14 విభాగంలో హాకీలో ఎస్‌కే సుల్తాన్‌బాషా ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారులకు ఆర్థికంగా పాఠశాల ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తితోపాటు పీడీ పి.శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

- ఒంగోలు సంతపేట పార్కు వద్ద చెత్తాచెదారం
- అన్నవరప్పాడు పార్కులో తుప్పుపట్టి విరిగిపోయిన ఆట వస్తువులు
- పిల్లలకు ఆహ్లాదాన్ని పంచకపోగా, వ్యాధులు పంచేలా ఉన్న పార్కులు
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు

ఆహ్లాదానికి అనారోగ్యం..!



సంతపేట నాటు బాబూరావు పార్కు గేటు వద్దే ఉన్న చెత్తాచెదారం

ఒంగోలు వన్‌టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒంగోలు నగరంలోని పార్కులన్నింటినీ ఎంతో అభివృద్ధి చేశారు. చిన్నారులకు ఆహ్లాదం కోసం ఆట వస్తువులు, వివిధ పరికరాలు, పచ్చటి తివాచి పరిచినట్లుగా గడ్డి, పలు రకాల మొక్కలు, వాటర్ ఫౌంటైన్లు, భారీ విద్యుత్ దీపాలతో పార్కులను సుందరంగా తీర్చిదిద్దారు. అంతేగాకుండా నగరంలోని అన్ని పార్కుల్లో పెద్దలకు సైతం ఉపయోగపడేలా జిమ్ పరికరాలతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో పార్కుల పరిస్థితి క్రమంగా మారుతూ వస్తోంది. నాలుగు నెలలుగా పర్యవేక్షణ కరువై కొన్ని పార్కులు ఆహ్లాదాన్ని పంచకపోగా, అనారోగ్యాన్ని పంచుతున్నట్లుగా అక్కడి వాతావరణం కనిపిస్తోంది. ఇటీవల వరకు పరిశుభ్రంగా పిల్లలు, పెద్దలతో కళకళలాడిన పార్కులు ప్రస్తుతం క్రమక్రమంగా కళావిహీనంగా మారుతున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రధానంగా నగరంలోని సంతపేటలో గల నాటు బాబూరావు పార్కు గేటు ముందే చెత్తాచెదారం తాండవిస్తోంది. రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పార్కులోకి వెళ్లిన వారు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. అలాంటి వాతావరణంలో పిల్లలు ఎక్కువసేపు ఉంటే వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పార్కుకు వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. అదే పార్కులో సందర్శకులు కూర్చోవడానికి సరిపడా బల్లలు కూడా లేవు. అదేవిధంగా అన్నవరప్పాడు పార్కులో ఒక్కటంటే ఒక్క ఆట వస్తువు కూడా లేదు. గతంలో ఏర్పాటు చేసిన ఊయల, తిరిగే రాట్నం, తదితర పరికరాలు తుప్పు పట్టి విరిగిపోయాయి. వాటిని పార్కులోనే ఒక మూలనపడేశారు. దీంతో ఈ పార్కు వలన ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. వాచ్‌మెన్ కూడా లేకపోవడంతో చీకటి పడితే మందుబాబులకు అడ్డాగా మారుతోంది. చుట్టుపక్కల నివాసాలు ఉన్నప్పటికీ రాత్రి కాగానే మందుబాబులు పార్కులోనే సిట్టింగ్ వేస్తున్నారు. స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మహిళలు, పిల్లలు రాత్రి వేళ అటువైపుగా రాకపోకలు సాగించాలంటేనే భయపడుతున్నారు. ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన పార్కులు అనారోగ్యాలను, అసాంఘిక కార్యకలాపాలను పెంచేలా తయారవడంపై ప్రజలు మండిపడుతున్నారు. నగరపాలక సంస్థ పాలకులు, అధికారులు నాలుగైదు నెలలుగా కనీసం పార్కుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేకపోవడం వలనే ఇలాంటి దుస్థితి ఏర్పడిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగానే పార్కుల పరిస్థితి అధ్వానంగా మారుతోందని విమర్శిస్తున్నారు.



ఆట వస్తువులే లేని అన్నవరప్పాడు పార్కు



అన్నవరప్పాడు పార్కులో మూలనపడేసిన పాడైపోయిన పరికరాలు

అన్నవరప్పాడు పార్కులో ఒక్క ఆట వస్తువు కూడా లేదు

స్థానిక అన్నవరప్పాడు పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఒక్క ఆట వస్తువు కూడా లేకుండా పోయింది. అందువలన పిల్లలు, పెద్దలు ఈ పార్కుకు రావడమే మానేశారు. చివరకు రాత్రి వేళ పార్కులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. పార్కును అభివృద్ధి చేసి ఆటవస్తువులు ఏర్పాటు చేస్తే స్థానికులకు, పిల్లలకు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

– వి.కృష్ణ, స్థానికుడు

చెత్తకుప్ప తొలగింపు



చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లిన ప్రాంతం

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు సబర్బన్: నగరంలోని కొణిజేడు బస్టాండ్ సెంటర్‌లో డంపింగ్ యార్డును తలపించేలా ఉన్న చెత్తకుప్పపై నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది బుధవారం తొలగించారు. కొణిజేడు బస్టాండ్ సెంటర్‌లో భారీగా చెత్త నిల్వ ఉండటంపై సాక్షి దినపత్రికలో బుధవారం ‘ప్రజారోగ్యానికి సంకటం’ శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చెత్తకుప్పను పూర్తిగా తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి సున్నంతో కలిపిన క్లోరిన్ చల్లారు. దీంతో ఆ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న గౌరవ చైర్మన్

ఒంగోలు సిటీ: తైక్వాండో పోటీల్లో స్థానిక రైజ్ కాలేజీ విద్యార్థులు కె.షామిలి, బి.సాయివెంకటమౌనిష్ ప్రతిభ చూపినట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ నిర్వహించిన తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. వారిని గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, తదితరులు అభినందించారు.

డాక్టర్‌ను ఎంపీటీసీ దూషించడంపై విచారణ



ఎంపీటీసీ వెంకట్రావును విచారిస్తున్న జిల్లా అధికారులు

కొత్తపట్నం: కొత్తపట్నంలో ఈ నెల 18వ తేదీ జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎం.వైష్ణవిని ఎంపీటీసీ సభ్యుడు రామలింగం వెంకట్రావు అసభ్యకరంగా దూషించారని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందిన ఫిర్యాదుపై బుధవారం విచారణ జరిగింది. డాక్టర్ ఫిర్యాదు మేరకు స్పందించిన కలెక్టర్.. జెడ్పీ సీఈవో బి.చిరంజీవి, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా వైద్యాధికారి సురేష్‌ను కమిటీగా నియమించి విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ముగ్గురు అధికారులతో కూడిన కమిటీ విచారణ చేపట్టింది. రామలింగం వెంకట్రావును విచారించగా, తనను వ్యక్తిగతంగా అవమానించడమే కాకుండా సర్పంచ్‌ని సమావేశాలకు రానివ్వకుండా డాక్టర్ అడ్డుకున్నారని ఆరోపించారు. సర్వసభ్య సమావేశంలో తీసిన వీడియోను చూపించగా, తాను అలా మాట్లాడలేదని, దానికి రెండు అర్థాలు ఉన్నాయని అన్నారు. మీరు మాట్లాడిన విషయమంతా పేపర్ మీద రాసివ్వాలని ఎంపీటీసీని అధికారులు కోరారు. అనంతరం డాక్టర్ వైష్ణవిని కూడా అధికారులు విచారించారు. ఆమెను కూడా పేపర్‌పై రాసివ్వాలని కోరారు. వారితోపాటు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులను కూడా జరిగిన దానిపై నివేదిక ఇవ్వాలని కోరారు. విచారణ నివేదికను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందిస్తామని ఆర్డీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. విచారణలో స్థానిక తహసీల్దార్ మధుసూదన్‌రావు, మండల అభివృద్ధి అధికారి శ్రీకృష్ణ, ఈవోఆర్డీ వేణుగోపాల్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపును పరిశీలించిన ఎంపీడీఓ



ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

మద్దిపాడు: మండలంలో రెండోరోజు వెల్లంపల్లి గ్రామంలో నిర్వహించిన ఆధార్ క్యాంప్‌ను బుధవారం మధ్యాహ్నం ఎంపీడీఓ వి.జ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. ఆధార్ క్యాంప్‌లో ప్రజలకు ఏర్పాటు చేసిన వసతుల గురించి ఎంపీడీఓ అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, షెడ్ వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆధార్ ప్రక్రియను వేగవంతం చేయాలని డీఏకి సూచించారు. అనంతరం వెల్లంపల్లి సచివాలయం పక్కనే ఉన్న మురుగు కాలువలో ఆయిల్ బాల్స్ వేయించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మాధవి, ఎంఎల్‌హెచ్‌పీ లిడియా, ఏఎన్‌ఎం శ్రీదేవి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నవంబర్ 24న 68వ బౌద్ధ దమ్మ దీక్ష ఉత్సవం



బౌద్ధ దమ్మ దీక్ష ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 24న 68వ బౌద్ధ దమ్మ దీక్ష ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి టీబీఎస్‌ఐ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు మహేష్ నాగ అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు, ఉపాధ్యక్షులు కె.బోధి, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా అడ్వైజరీ ప్రెసిడెంట్ గురవయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఒంగోలు కేంద్రంగా నవంబర్ 24న నిర్వహించనున్న 68వ బౌద్ధ దమ్మ దీక్ష ఉత్సవానికి రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర నాయకులు వెంకట్రావు, నాగేంద్రవదన్, డాక్టర్ సీహెచ్ సుధాకర్, సుధీర్, డీఈ డీపీఆర్ సుధాకర్, హరిప్రసాద్, రంగారావు, నాగేశ్వరరావు, రాజేష్, సీహెచ్ బాబు, అజయ్ బాబు, రామకృష్ణ, అనిల్, ఆనంద్‌సాయి, శ్రీనివాసులు, రామాంజనేయులు, ప్రకాశం, జాలరామయ్య, ప్రేమ్‌చంద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలి



కంది పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

చీమకుర్తి రూరల్: మండలంలోని ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బూదవాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంటలు సాగుచేసిన రైతులంతా ఈ పంటలో నమోదు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డ్ తీసుకోవాలని చెప్పారు. రబీలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల వారీగా చెల్లించాల్సిన మొత్తాన్ని వివరించారు. ఎకరాకు శనగకు రూ.368, వరికి రూ.215, జొన్నకు రూ.60, మినుముకు రూ.102, మిర్చికి రూ.525 చెల్లించాలని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగు మందులు పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు. కంది పంటలను పరిశీలించి పైరుకు ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందని, నివారణకు గ్రాము కార్బండిజంను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కంది, వరి పంటలను ఆశించే తెగుళ్లపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.వి.భాస్కర్, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మహబూబ్

ఒంగోలు సిటీ: ప్లాట్‌ఫాంపై పడుకుంటూ చలికి వణికిపోతున్న 100 మందికి దోస్తి ఫౌండేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేసిన మహబూబ్ ప్రతి సంవత్సరం ఒంగోలులో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంపై పలువురు అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌పై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుధాకర్‌బాబు

కొత్తపట్నం: బాల్యం నుంచే పోలీస్‌స్టేషన్‌పై అందరూ అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఆత్మస్థైర్యంతో బతకవచ్చని కొత్తపట్నం ఎస్సై సుధాకర్ బాబు సూచించారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీస్ అమరవీరుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన తర్వాత ఎవరితో ఎలా మాట్లాడాలి, కేసు ఎలా పెట్టాలి, స్టేషన్‌లో ఎవరెవరు ఉంటారు, కేసులు ఏ విధంగా రాయాలి, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బాలికలు తమ చట్టాల గురించి తెలుసుకుంటే నిత్య జీవితంలో మోసపోకుండా జీవించవచ్చన్నారు. మీకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నిర్భయంగా రిపోర్ట్ ఇవ్వాలని కోరారు. స్టేషన్‌లో వాడే పరికరాలు ఎలా వాడాలి, ఎప్పుడు వాడతారనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో రైటర్ రంగారావు, హెడ్‌కానిస్టేబుల్ పాండు, తదితరులు పాల్గొన్నారు.

స్వాములకు ఉచితంగా దుస్తుల పంపిణీ

కందుకూరు: అయ్యప్పస్వామి మాలధారణ స్వాములకు తమ చారిటబుల్ ట్రస్టు తరఫున ఉచితంగా మాలధారణ దుస్తులు అందజేస్తామని ఎంఎస్‌ఎస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మాదాల మనోజ్‌కుమార్ బుధవారం తెలిపారు. 9391144797, 9908109696, 9948450550 నంబర్లకు తమ సమాచారం తెలియజేయాలని కోరారు.

రాళ్లపాడు నీటిమట్టం 17.1 అడుగులు



జిర్రావారిపాలెం వద్ద ఉత్తర కాలువలో ఉన్న పైపులను తొలగిస్తున్న దృశ్యం



17.1 అడుగులకు చేరిన రాళ్లపాడు నీటిమట్టం

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 17.1 అడుగులకు చేరినట్లు జేఈ చంద్రమౌళి చెప్పారు. మన్నేరు, పిల్లాపేరు, ఉప్పుటేరుల నుంచి 130 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రాజెక్టుకు వస్తుందని చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు కాగా, 17.1 అడుగులు వచ్చినట్లు చెప్పారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురిస్తే మరింత నీరు చేరి పూర్తిస్థాయిలో నిండుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు...

ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత పనులు చేపట్టినట్లు జేఈ చెప్పారు. ఈ సంవత్సరం వరి పంటకు నీరిచ్చే విధంగా సన్నాహాలు జరుగుతున్నాయని, అందులో భాగంగా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు చెప్పారు. సోమశిల జలాశయం నుంచి వచ్చే ఉత్తర కాలువ కలిగిరి మండలం జిర్రావారిపాలెం వద్ద చిన్నపాటి పైపులు వేయడంతో రాళ్లపాడు వైపునకు నీరు కొంచెంగా వస్తుండటంతో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం ఆ పైపులను తొలగింపజేసినట్లు చెప్పారు. సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువకు త్వరలో నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు.

తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యం



బాధితుడిపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నాయకులు

ఉలవపాడు: తన సొంత స్థలంలో సిమెంట్ రోడ్డు వేయడానికి అంచనాలెందుకు వేస్తున్నారని ప్రశ్నించినందుకు నారిశెట్టి మాల్యాద్రిపై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలో చాకిచర్ల పంచాయతీలోని సుబ్బరాయుడు సత్రంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన నారిశెట్టి మాల్యాద్రికి సర్వే నంబర్ 474లో స్థలం ఉంది. ఆ స్థలంలో కొంత ఈశాన్యం కోసం వదిలారు. అందులో నుంచి కొందరు నడుస్తున్నారు. ఆ స్థలంలో సిమెంట్ రోడ్డు నిర్మించాలని అంచనాలు వేయడానికి కొలతలు తీస్తున్న సమయంలో.. అది తన సొంత స్థలమని, అక్కడ ఎలా రోడ్డు వేస్తారని నారిశెట్టి మాల్యాద్రి, అతని భార్య ప్రశ్నించారు. తాము ఈశాన్యం కోసం వదిలామని, అక్కడ సిమెంట్ రోడ్డు వేస్తే ప్రభుత్వ స్థలం అవుతుందని, అందువలన అక్కడ రోడ్డు వేయడానికి వీల్లేదని తెలిపారు. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మిరియం మల్లికార్జున, సురేష్‌లు వారితో వాగ్వాదానికి దిగారు. మేము రోడ్డు వేస్తాం..అంతే.. అంటూ దౌర్జన్యం చేశారు. తమ సొంత స్థలంలో రోడ్డు ఎలా వేస్తారని యజమానులు ప్రశ్నిస్తున్నా.. టీడీపీ నేతలు మాత్రం రోడ్డు వేస్తామంటూ హెచ్చరించి వెళ్లిపోయారు. ఇంత జరుగుతున్నా అధికారులు మౌనంగా చూస్తూ ఉన్నారని బాధితుడు మాల్యాద్రి వాపోయాడు. ఇది ఎంత వరకు సబబు అని, ఈ విషయంపై ఉన్నతాధికారులుకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.